సాక్షి
చిత్తూరు
గురువారం । 1 । మే । 2025



వరసిద్ధుడికి ఆభరణాలు
కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి ఓ భక్తుడి కుటుంబ సభ్యులు వెండి, బంగారు ఆభరణాలు సమర్పించారు. - 8లో



మద్యం పాలసీలో అవినీతి లేదు
గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం పాలసీలో అవినీతి జరగ లేదని నారాయణస్వామి అన్నారు. - 8లో



తాగునీటి ఎద్దడి రానివ్వకండి
జిల్లాలో తాగునీటి ఎద్దడి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. - 8లో

కోడె వృద్ధి.. పాడి సమృద్ధి



లక్ష్య సాధన దిశగా కేంద్రం

కేంద్రంలోని హెచ్‌జీఎం విత్తన కోడె

పాడి పంటలు..వ్యవసాయ కుంటుబాలకు రెండు కళ్లు. పంట సాగులో నష్టమొస్తే కర్షకులను పాడి పశువులు కామధేనువుల్లా ఆదుకుంటున్నాయి. అలాంటి పాడి సంపద ఉత్తమంగా ఉంటే రైతులు ఆర్థికాభివృద్ధికి మరింత చేయూత నిస్తాయి. ఇందుకు ఉత్తమ విత్తన కోడెల ఎంపికే లక్ష్యంగా చిత్తూరు కేంద్రంగా పశుసంతతి పరిశీలన కేంద్రం ఏర్పాటు అయ్యింది. ఈ కేంద్రం ఉత్తమ కోడెల ఎంపికలో లక్ష్యం దిశగా పరుగులు తీస్తోంది. అత్యుత్తమ విత్తన కోడెలు, ఆవులను వృద్ధి చేసి, పాడి సమృద్ధికి పాటుపడుతోంది. అన్నదాతలకు అండగా నిలుస్తోంది.

- ఉత్తమ ఆవుల వృద్ధికి పశుసంతతి పరిశీలన పథక కేంద్రం విశేష కృషి
- జన్యు సామర్థ్యపు విత్తన కోడెల ఉత్పత్తిలో ముందడుగు
- సంకరజాతి పశువుల అభివృద్ధే లక్ష్యంగా పరిశీలన పథక కేంద్రం శాస్త్రవేత్తల కార్యాచరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పాల దిగుబడి పెంపే లక్ష్యంగా ఆరోగ్యకరమైన, దృఢమైన సంకరజాతి పశు సంపదను ఉత్పత్తిలో జిల్లాలోని పశు సంతతి పరిశీలన పథక కేంద్రం ప్రధాన భూమిక పోషిస్తోంది. వీర్య కేంద్రాల్లోని విత్తన కోడెలను పరిశీలించి, తద్వారా అత్యధిక జన్యుసామర్థ్యం కలిగిన విత్తనపు కోడెలను ఉత్పత్తి చేయడంలో ఈ కేంద్రం ముందు వరుసలో నిలిచింది. వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమలో మేలు జాతి సంతతిని పెంచుతూ పాడి పరిశ్రమాభివృద్ధికి కృషిలో గుర్తింపు పొందింది. విత్తన కోడెలను ఉత్పత్తి చేయడంలో లక్ష్యాన్ని అధిగమిస్తోంది.

ఉత్తమ కోడెల ఎంపిక ఇలా..

రాష్ట్రంలోని నంద్యాల, బనవాసి, విశాఖపట్నంలోని వీర్య కేంద్రాలతోపాటు దేశంలోని పలు వీర్యకేంద్రాల్లోని విత్తనపు కోడెల నుంచి వీర్యాన్ని సేకరించి, ఆ వీర్య నాళికలను చిత్తూరులోని పశు సంతతి పరిశీలన పథక కేంద్రానికి పంపుతారు. ఈ కేంద్రంలోని శాస్త్రవేత్తలు ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల పశువులకు ఆ వీర్య నాళికలను కృత్రిమ గర్భధారణ చేస్తారు. ఆ పశువు ఈనిన దూడలను పర్యవేక్షిస్తారు. ఆ పేయదూడలు పెద్దవై ఈనిన తరువాత పాలిచ్చే సమయంలో వాటి పాల దిగుబడిని కొలిచి, విత్తనపు కోడెల సామర్థ్యాన్ని లెక్కిస్తారు. వీటిలో మంచి పాల దిగుబడి వచ్చిన పశుసంపద జననానికి కారణమైన కోడెను నిరూపితమైన కోడె(ప్రూవింగ్ బుల్)గా గుర్తిస్తారు. ఈ కోడెకు పుట్టిన పేయదూడలను ఉత్తమ ఆవులు(ఎలైట్ డాటర్) అంటారు. ఇలా ఈ కేంద్రంలో ఏటా సుమారు 20 విత్తన కోడెల వీర్యాన్ని పరీక్షిస్తారు. ఇందులో మంచి ధృఢమైన 2-4 కోడెలను ఎంపిక చేస్తారు. అలాగే పాల దిగుబడిని కొలవడం ద్వారా అత్యధిక పాల దిగుబడి నిచ్చే ఆవులను గుర్తించడంతోపాటు ప్రూవింగ్ బుల్‌కు పుట్టిన కోడె వీర్యాన్ని, పేయ దూడలకు గర్భ ధారణ చేయించి, వాటికి పుట్టిన పశుసంపదను అత్యుత్తమ పశుసంపదగా పరిగణిస్తారు. మగ దూడలైతే హెచ్‌జీఎం(హైజెనిటిక్ మెరిట్) విత్తన కోడెలుగా పరిగణిస్తారు. ఈ హెచ్‌జీఎం విత్తను కోడెలను ప్రభుత్వం రైతులకు మంచి ధర చెల్లించి, కొనుగోలు చేసి, దేశంలోని వీర్య కేంద్రాలకు సరఫరా చేస్తుంది.

జిల్లాలో 2013-14 కేంద్రం ప్రారంభం నుంచి ఈ పథకం లక్ష్యం కోసం అధికారులు కృషి చేస్తున్నారు. మంచి పాడి వృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు 305 విత్తనపు కోడెలను పరీక్షకు పెట్టారు. అలాగే పాల దిగుబడికి 38,807 ఆవులను నమోదు చేశారు. 420 హెచ్‌జీఎం కోడె దూడలను ఉత్పత్తి చేశారు.

సంవత్సరం	పరీక్షకు పెట్టిన విత్తన కోడెల సంఖ్య	పాలదిగుబడి నమోదు చేసిన ఆవులు	ఉత్పత్తి చేసిన హెచ్‌జీఎం కోడె దూడల సంఖ్య
2013-14	20	567	0
2014-15	25	3129	9
2015-16	30	925	25
2016-17	30	1255	49
2017-18	30	4130	55
2018-19	18	2431	36
2019-20	18	2034	0
2020-21	20	3635	10
2021-22	22	6555	31
2022-23	23	6041	108
2023-24	23	3584	79
2024-25	23	4518	49

చిత్తూరు కేంద్రంగా...



పశుసంతతి పరిశీలన పథక కార్యాలయం

చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ సమీపంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తోంది. తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు ఇందులో భాగంగా ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జెర్సీ-సహివాల్ జాతి సంకర ఆవులు ఎక్కువగా ఉన్నాయి. ఈ సంకర ఆవులు మంచి రోగ నిరోధక శక్తి, ప్రతికూల పరిస్థితుల్లో కూడా మంచి పాల దిగుబడికి పేరు గాంచాయి. అందుకే రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో మాత్రమే ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

ఇదీ ఉద్దేశం..

జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ద్వారా సంకరజాతి జెర్సీ ఆవుల్లో ఎన్‌డీపీ-1 స్కీం కింద పశుసంతతి పరిశీలన పథకాన్ని 2013-14 సంవత్సరంలో ప్రారంభించారు. ఇది 2018-19 వరకు కొనసాగింది. తరువాత 2019-20 నుంచి ఈ పథకాన్ని రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం) కింద అమలు చేస్తున్నారు. సంకర జాతి జెర్సీ ఆవుల్లో జన్యుపర్యంగా పాడి ఉత్పాదక శక్తిని పెంపొందించడం, వీర్య కేంద్రంలో ఉన్న విత్తనపు కోడెలను (బ్రీడింగ్ బుల్స్) పరిశీలించి, వాటి ద్వారా అత్యధిక జన్యు సామర్థ్యం కలిగిన విత్తనపు కోడెలను ఉత్పత్తి చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

భవిష్యత్ దృష్ట్యా...



పాల నమోదు కార్యక్రమం ద్వారా అధిక పాల దిగుబడినిచ్చే ఉత్తమ ఆవులను గుర్తిస్తున్నాం. దేశంలోని అన్ని వీర్య కేంద్రాల్లోని సంకర జాతి జెర్సీ-సహివాల్ జాతి విత్తనపు కోడెలను పరీక్షిస్తున్నాం. అత్యధిక జన్యుసామర్థ్యం కలిగిన కోడె దూడలను ఉత్పత్తి చేస్తున్నాం. రాబోవు తరాల్లో సంకరజాతి జెర్సీ ఆవుల పాడి ఉత్పాదక జన్యు సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– వాసు, జిల్లా పశుసంతతి పరిశీలన కేంద్ర డీడీ, ప్రాజెక్టు కోఆర్డినేటర్, చిత్తూరు

న్యూస్‌రీల్

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

– జిల్లా కన్వీనర్ రవీంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025-26 విద్యాసంవత్సరానికిగాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో విద్యనభ్యసించేందుకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటింగ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్, డీజిల్ మెకానిక్, మెషినిష్ట్, టర్నర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ నెల 28 నుంచి మే 24వ తేదీ వరకు www.iti.ap.gov.in (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్) వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థి యూనిక్ నంబర్, ఒరిజినల్ సర్టిఫికెట్లను దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పరిశీలన చేయించుకోవాలన్నారు. మెరిట్‌లిస్టులో ఉన్న విద్యార్థులకు జిల్లా మొత్తం ఐటీఐలకు చిత్తూరు ఐటీఐలో మొదటి కౌన్సిలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. నమోదు, వెరిఫికేషన్ చేయించుకునేందుకు మే 26 వ తేదీ చివరి తేదీ అని వెల్లడించారు. ఇతర వివరాలకు 7799933370, 7799679351 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలు ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో నూతన అడ్మిషన్లు, మూడో తరగతి అడ్మిషన్లు, 4 నుంచి 9 వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని 2 బాలురు, 2 బాలికల గిరిజన గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. మూడో తరగతి, నూతన అడ్మిషన్లకు ఎస్టీ 120, ఎస్సీ 20, బీసీ 8, ఓసీ 4, ఏఈక్యూ (ఏజెన్సీ ప్రాంత ఉద్యోగుల పిల్లలు) 4, పీహెచ్‌సీ 4 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఏఈక్యూ, పీహెచ్‌సీ విద్యార్థులు లేని పక్షంలో ఆ సీట్లను ఎస్టీ విద్యార్థులకు కేటాయిస్తామన్నారు. అలాగే 4 నుంచి తొమ్మిదో తరగతి వరకు బ్యాక్‌లాగ్‌లో ఖాళీగా ఉన్న సీట్లు కేవలం ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేస్తామన్నారు. చిత్తూరు బాలికల గురుకుల పాఠశాలలో 145 ఖాళీలు, పుంగనూరు బాలికల పాఠశాలలో 205, బంగారుపాళెం బాలుర పాఠశాలలో 203, రామకుప్పం బాలుర పాఠశాలలో 157 మొత్తం 710 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. అడ్మిషన్ల నిమిత్తం ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు సంబంధిత ప్రిన్సిపల్ వద్ద దరఖాస్తులను తీసుకుని, పూర్తి చేసి మే 20 వ తేదీలోపు ఆయా పాఠశాలల్లోనే సమర్పించాలని తెలిపారు. అందిన దరఖాస్తులన్నింటినీ లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. ఇతర వివరాలకు 8500968128 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు పింఛన్‌ల పంపిణీపై క్షేత్ర స్థాయి అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే ఒకటో తేదీన జిల్లాలోని 2,64,520 మంది లబ్ధిదారులకు రూ.112.80 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అలసత్వం వహించకుండా పింఛన్‌దారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందజేయాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టాలన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. గత నెలల్లో వివిధ కారణాలతో పింఛన్ తీసుకోని వారికి ఈ నెలలో మొత్తం నగదు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

శాంతిభద్రతల పటిష్టతకు చర్యలు



తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పుత్తూరు: జిల్లాలో శాంతిభద్రతల పటిష్టతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని వడమాలపేట, నారాయణవనం, పుత్తూరు స్టేషన్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ గంజాయి, సారా, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి, శాంతిభద్రతలను మరింత మెరుగుపరచనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రత్యేకించి ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు జాతీయ రహదారుల్లో నిఘా వ్యవస్థను పెంచుతున్నట్లు తెలిపారు. పాత నేరస్తులపై నిఘా ఉంచి, బీట్ సిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌ఓల ద్వారా గ్రామ సభలు నిర్వహిస్తూ, పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.రవికుమార్, సీఐ కెబీ సురేంద్రనాయుడు, ఎస్‌ఐ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- జిల్లాలో ఈ నెల 4న పరీక్ష
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 4వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. జిల్లాలో ఈ పరీక్ష నిర్వహణపై బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా నీట్ నిర్వహించాలన్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, మెడికల్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో అడ్మిషన్లకు నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తుందని చెప్పారు. జిల్లాలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 432 మంది, సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో 278 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. మే 4వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలను సంబంధిత అధికారులు ప్రతిష్టాత్మకంగా భావించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయండి

పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో, ప్రశ్నపత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్‌ల భద్రత నడుమ కేంద్రాలకు ప్రశ్న పత్రాలను తరలించాలని చెప్పారు. పరీక్ష నిర్వహించే సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా, మౌలిక వసతుల సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద నిర్దేశించిన ప్రాంతంలో తల్లిదండ్రులు వేచి ఉండేందుకు షామియానా, నీటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సరైన సమయానికి చేరుకునేలా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. విభిన్నప్రతిభావంతులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర వైద్యసేవలకు అంబులెన్స్, ఫైర్ ఇంజిన్లను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు, ఇన్విజిలేటర్‌లు మొబైల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లకుండా తనిఖీలు చేయాలన్నారు. మొబైల్ ఫోన్‌లు భద్రపరిచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద రెవెన్యూ, పోలీసు తరఫున ఒక నోడల్ అధికారిని నియమించాలని తెలిపారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రశ్నపత్రాలను ఆర్మ్‌డ్ పోలీసుల ఎస్కార్ట్‌తో పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ చేయించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, డీఈఓ వరలక్ష్మి, ఆర్టీఓ శ్రీనివాసులు, పీవీకేఎన్ కళాశాల పరీక్షల విభాగం కోఆర్డినేటర్ శరవణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల్లో ఆధ్యాత్మిక భావం





జౌకొత్తూరులో పూజలు చేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మరసనపల్లెలో పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

– మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: గ్రామీణ ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెరిగాయని, ప్రతి గ్రామంలోను ఆలయాలు నిర్మిస్తున్నారని, ప్రజలందరూ సన్మార్గంలో నడిచేందుకు పునాదులు పడుతున్నారని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని జౌకొత్తూరులో బోయకొండ గంగమ్మ ఆలయాన్ని ప్రారంభించి, పూజలు చేశారు. అలాగే మరసనపల్లెలో సీతారామ లక్ష్మణుల ఆలయాన్ని పూజలు చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్దిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గంగమ్మ ఆలయాలు, శ్రీరామచంద్రుడు, అంజనేయస్వామి, నరసింహస్వామి ఆలయాలతోపాటు ప్రతి గ్రామంలోనూ గ్రామదేవతల ఆలయాలు నిర్మిస్తూ, భక్తిమార్గం వైపు పయనిస్తుండడం శుభపరిణామమన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణాలకు తమ కుటుంబం వ్యక్తిగతంగా సహాయసహకారాలు అందిస్తుందన్నారు. ప్రజలు ప్రతి రోజూ ఆలయాలకు వెళ్లడం అలవర్చుకోవాలన్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

పరేషాన్ తీరింది!

రేషన్‌కు ప్రతి సభ్యుడికీ ఈకేవైసీ తప్పనిసరి మెలిక.. అదీ ఏప్రిల్ 30 వరకే గడువు.. ఆపై సరుకులు కట్.. వెరసి.. రేషన్‌కార్డులు పరేషాన్ కావాల్సిన పరిస్థితి. సుదూర ప్రాంతాల్లోని పిల్లలు.. కదలలేని వృద్ధులు.. వేలి ముద్రలు పడని చిన్నారులు ఏమి చేయాలని పేదలు ఖంగారు.. ఎట్టకేలకే మళ్లీ ఈకేవైసీ గడువు పొడిగింపుతో వారి పరేషాన్ తీరింది. అమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు.



- ఈకేవైసీ గడువు పొడిగింపు
- జూన్ నెల ఆఖరు వరకు గడువు
- ఇప్పటికీ 1,05,185 మందికి పెండింగ్
- వలస కూలీలు, ఉద్యోగులే పెండింగ్‌లో అధికం

కాణిపాకం: ఈకేవైసీ గడువు మళ్లీ పొడిగింపు జరిగింది. పేదలకు పరేషాన్ తీరింది. ఈ ప్రక్రియ గడువు బుధవారంతో ముగుస్తుందని టెన్షన్ పడిపోయారు. వచ్చే నెల నుంచి సరుకులు కట్ అనుకున్నారు. అయితే ప్రభుత్వం మళ్లీ ఈకేవైసీ గడువు జూన్ నెలాఖరు వరకు పొడిగించింది. దీంతో కార్డుదారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికీ జిల్లావ్యాప్తంగా 1.05 లక్షల మంది పైగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఎక్కడైనా చేయించుకోవచ్చని అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఫలితం శూన్యమవుతోంది. వలస కూలీలు, ఉద్యోగులు ఈకేవైసీ చేయించుకోవాల్సిన జాబితాలో అధికంగా ఉన్నారని అధికారులు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 1,339 రేషన్ దుకాణాల పరిధిలో 5.40 లక్షల రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుల్లో 16,70,470 మంది సభ్యులున్నారు. పారదర్శకత పేరుతో జాతీయ సమాచార సంస్థ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ నవీకరిస్తున్నారు. మృతులు ఉండడంతోపాటు అనర్హులైన పలువురు ఉద్యోగులు రేషన్ పొందుతున్నారని ప్రభుత్వం అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో రేషన్ భారాన్ని తగ్గించుకునే ఉద్దేశంతో ఈకేవైసీ తప్పనిసరి చేసింది. కార్డులో ఉన్న ప్రతి సభ్యుడూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని స్పష్టం చేసింది.

ఈకేవైసీ అధికంగా పెండింగ్ ఇక్కడే..

జిల్లాలో కుప్పం, వి.కోట, పలమనేరు, చిత్తూరు, నగరి, పుంగనూరు, రామకుప్పం తదితర ప్రాంతాల్లో అత్యధికంగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అధిక శాతం మంది బతుకుదెరువు కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు ఉన్నారని స్థానికులు చెబుతున్నారు.

సరుకు రాదని..

గడువు ముగుస్తుండడంతో చాలా మంది కార్డుదారులు పనులు మానుకుని ఈకేవైసీ కోసం క్యూ కట్టారు. కర్ణాటక, తమిళనాడు, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు పరుగు పరుగున వస్తున్నారు. మిగిలిన కొంత మంది అవగాహన లోపం కారణంగా రాలేకపోతున్నారు. ఒక రోజు పని వదులుకుంటే కష్టమని కొంతమంది, రాలేని పరిస్థితుల్లో మరికొంత ఉన్నారు. వీరికి ఉన్న చోటే ఈకేవైసీ చేసుకోవచ్చనే విషయం తెలిక ఈకేవైసీ చేయించుకోలేకపోతున్నారు. ప్రైవేటు ఉద్యోగాలు చేసే వ్యక్తులు, బయట రాష్ట్రాల్లో చదివే కళాశాల విద్యార్థులు సైతం ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. వీరితోపాటు మృతులు, కదలలేని వృద్ధులు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు కలిపి 75 వేల మందికి పైగా ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. 0-5 పిల్లలు 26,628 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని గుర్తించారు. వీరిలో ఐదేళ్లు దాటిన పిల్లల తల్లిదండ్రులకు ఈకేవైసీ ప్రక్రియ తలనొప్పిగా మారింది. మండుటెండలో పిల్లలను వెంట పెట్టుకుని ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇక ఎక్కడైతే రేషన్ తీసుకుంటున్నారో..ఆ ప్రాంతాల్లోనే ఈకేవైసీ చేయించుకోవాలని కొంత మంది డీలర్లు మెలిక పెడుతున్నారు.

మార్చి నుంచి ప్రారంభం

ఈకేవైసీ ప్రక్రియ గత మార్చి 19వ తేదీ నుంచి అన్ని రేషన్ షాపుల్లో ప్రారంభమైంది. తొలుత మార్చి 23 వరకు గడువు పెట్టారు. ఆ తర్వాత నెలాఖరు వరకూ పొడిగించారు. అప్పటికీ ఈ-కేవైసీ చేయించుకోవాల్సిన కార్డుదారులు పెద్ద సంఖ్యలో మిగిలిపోవడంతో ఈకేవైసీ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకూ 15,37,402 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. మరో 1,05,185 మంది ఈ ప్రక్రియ పూర్తి చేయించుకోవాల్సి ఉంది.

జిల్లా సమాచారం...

చౌకదుకాణాలు -	1,339
రేషన్‌కార్డుల సంఖ్య -	5.40 లక్షలు
కార్డులోని సభ్యులు -	16,70,470
ఈకేవైసీ చేయించుకున్నవారు -	15,37,402
పెండింగ్‌లోని 0-5 వయస్సుపిల్లలు -	26,628
80 ఏళ్లు దాటిన వృద్ధులు -	1,255
చేయించుకోవాల్సి వారు మొత్తం -	1,05,185

ఈకేవైసీ కొత్తకార్డులకు శాపమా?

ఈకేవైసీ ప్రక్రియను సాకుగా చూపి, కూటమి ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల మంజూరును వాయిదా వేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో కొత్త రేషన్‌కార్డులకు సచివాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తారని ప్రకటించింది. సంక్రాంతికి కొత్త కార్డులని, ఆ తర్వాత ఉగాదికని చెప్పింది. అప్పటికీ ఆ ఊసే లేదు. దీంతో కూటమి నేతలు కూడా ప్రజలకు సమాధానం చెప్పుకోలేక గుటకలు మింగుతున్నారు. ప్రస్తుతం ఈకేవైసీ ప్రక్రియ పొడిగింపుతో కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి మళ్లీ నిరాశే మిగిలింది.

ఆందోళన వద్దు

ఈకేవైసీ చేయించుకోవాల్సిన వారు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. జూన్ నెలాఖరు వరకు గడువు ఉంది. ఈ విషయాన్ని గమనించి ఇంత వరకు ఈకేవైసీ చేయించుకోని వారు చేసుకోవచ్చు. రాష్ట్రంలో ఎక్కడైనా ఈకేవైసీ చేసుకోవచ్చు. ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. డీలర్లు ఈప్రక్రియను పూర్తిచేసేలా చూడాలి. కార్డుదారులను ఇబ్బంది పెట్టవద్దు.

– శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

జిల్లాలో 201 రిజిస్ట్రేషన్లు



డాక్యుమెంట్ అందజేస్తున్న రిజిస్ట్రార్ రమణమూర్తి, సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని చిత్తూరు ఆర్వో మినహాయించి మిగిలిన 7 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం బుధవారం ప్రారంభమైంది. జిల్లాలో మొత్తం 201 రిజిస్ట్రేషన్లు కాగా వాటి ద్వారా రూ.75.88 లక్షలు ఆదాయం వచ్చింది. చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి, సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్‌తో కలిసి డ్యాకుమెంట్లను కొనుగోలుదారులకు అందజేశారు. చిత్తూరు రూరల్‌లో 33 డ్యాకుమెంట్లు జరగగా రూ.10.29 లక్షలు, పలమనేరు 32 డ్యాకుమెంట్లు రూ.14.39 లక్షలు, బంగారుపాళెం 19 రూ.10.93 లక్షలు, నగరి 25 రూ.21.94 లక్షలు, పుంగనూరు 36 రూ.6.91 లక్షలు, కుప్పంలో 36కు రూ.7 లక్షలు, కార్వేటినగరం 24 రూ.4.33 లక్షలు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. రేషన్‌కార్డుదారులకు పంపిణీ కోసం ప్రభుత్వం జిల్లాకు 8,500 మెట్రిక్ టన్నుల బియ్యం, 3 వేల మెట్రిక్ టన్నుల చక్కెర సరఫరా చేసినట్లు పేర్కొన్నారు.

వరసిద్ధుడికి వెండి, బంగారు ఆభరణాలు



కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారికి బుధవారం ఓ భక్తుడి కుటుంబం వెండి, బంగారు ఆభరణాలను సమర్పించింది. ఆలయ మాజీ ప్రధాన అర్చకులు చంద్రమౌళి గురుక్కల్, సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు ఆభరణాలను ఈఓ పెంచలకిషోర్‌కు అందజేశారు. 200 గ్రాముల బంగారు గాజులు, కమ్మలు, హారం, చైన్ ముక్కు పుడకలు, 500 గ్రాముల వెండి బిస్కెట్ ఇచ్చారు. వీటి విలువ రూ.15 లక్షలు ఉంటుందని దాత కుటుంబ సభ్యులు రాఘవేంద్ర గురుకల్, ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కమిటీలో జిల్లా నేతలు

తిరుపతి సిటీ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీని బుధవారం ప్రకటించారు. ఇందులో తిరుపతి జిల్లాకు చెందిన చిట్టేటి హరికృష్ణ సెక్రటరీగా, కామిరెడ్డి మోహన్‌రెడ్డిని జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన జి.సుధాకర్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

వైద్య విధాన పరిషత్ ఏడీగా సునీత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య విధాన పరిషత్ ఏడీగా సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కావలి ఆస్పత్రిలో ఏఓగా పనిచేస్తున్న ఈమె ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా వైద్య విధాన పరిషత్ ఏడీగా బాధ్యతలను స్వీకరించారు.

రిటైర్డు పోలీసులకు సన్మానం



రిటైర్డు అయిన పోలీసులతో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను ఎస్పీ మణికంఠ ఘనంగా సన్మానించారు. బుధవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో జరిగిన సమావేశంలో పోలీసుశాఖలో రిటైరైన మనోహరన్ (ఏఎస్ఐ), సుధాకర్ పిల్లై (ఏఎస్ఐ), మహ్మద్ రఫీ (హెడ్ కానిస్టేబుల్), శివాజీ (ఏఆర్-హెడ్ కానిస్టేబుల్)ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. పదవీ విరమణ చేసినప్పటికీ పోలీసుశాఖ నుంచి ఎప్పుడూ సహకారం అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎస్పీ మహబూబ్ బాషా, పోలీసు యూనియన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినతిరుమల.. కీలపట్ల!

- మే 5నుంచి కోనేటిరాయుని వార్షిక బ్రహ్మోత్సవాలు
- అత్యంత చారిత్రక నేపథ్యం ఉన్న పురాతన ఆలయమిది
- ఇక్కడి మూలవిరాట్టు తిరుమల మూలమూర్తిని పోలిఉంది
- తాళ్ళపాక అన్నమయ్య కీర్తనలలో కీలపట్ల ప్రస్థావన
- జిల్లానుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు





కీలపట్లలోని కోనేటిరాయుని ఆలయం, మూలవిరాట్ స్వామివారు

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చారిత్రిక వైష్ణవాలయాల్లో తిరుమల వేంకటేశ్వరునితోపాటు పలమనేరు నియోజవర్గంలోని గంగవరం మండలం కీలపట్లలో వెలసిన కోనేటిరాయుని ఆలయానికి చినతిరుమలగా పేరుంది. తిరుమలకు వెళ్లలేని పేద భక్తులు కీలపట్ల ఆలయంలో స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమలలోని మూలవిరాట్టు విగ్రహం ఎలా ఉందో ఇక్కడి ఆలయంలోనూ స్వామివారి మూలవిరాట్ అలాగే ఉంటారని, తిరుమల స్వామివారే ఇక్కడున్నారని భక్తుల నమ్మకం. తిరుమల తరహాలో ఇక్కడి ఆలయంలోనూ ఏటా స్వామివారికి టీటీడీ ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఇదీ ఆలయ చరిత్ర..

కీలపట్లలోని మూలవిరాట్టు కోనేటిరాయుని(శ్రీ వేంకటేశ్వరస్వామి) విగ్రహాన్ని భృగుమహర్షి ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతోంది. ఆపై చోళులు, పల్లవులు, విజయనగర రాజుల ఏలుబడిలో విశేష పూజలందిచారని తెలుస్తోంది. అప్పట్లో మహ్మదీయుల దండయాత్రలకు భయపడిన గ్రామస్తులు స్వామివారి విగ్రహాన్ని కోనేటిలో దాచి ఉంచినందునే స్వామివారికి కోనేటిరాయునిగా పేరొచ్చినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. చంద్రగిరిని పాలించిన సామంతులు బోడికొండమ నాయుడుకి కలలో స్వామి వారు కనిపించి కోనేటిలోని విగ్రహాన్ని ఆలయంలో తిరిగి ప్రతిష్ఠించమని చెప్పినట్టు చరిత్రకారులు చెబుతున్నారు.

4 నుంచి కోనేటి రాయుడి ఉత్సవాలు

మే 4న సాయంత్రం సేనాధిపతి ఉత్సవంతో కోనేటిరాయుని బ్రహ్మోత్సవాల అంకురార్పణ జరుగుతుంది. మే 5న ధ్వజారోహణం, అదేరోజు సాయంత్రం పెద్దశేషవాహనం, 6న చిన్నశేషవాహనం, హంసవాహనం, మే 7న సింహవాహనం, ముత్యపుపందిరి, 8న కల్పవృక్ష వాహనం, 9న మోహినీ ఉత్సవం, సాయంత్రం శ్రీవారి కళ్యాణోత్సవం, గరుడవాహన సేవలు జరుగుతాయి. మే 10వ తేదీ ఉదయం హనుమంత వాహనసేవ, వసంతోత్సవం, గజవాహన సేవ, 11న సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు, 12న స్వామివారి రథోత్సవం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

మూలవిరాట్‌లు ఒకేపోలిక

కీలపట్లలోని స్వామివారు, తిరుమలలోని స్వామివార్ల మూలవిరాట్‌లు ఒకే తరహాలో ఉంటారని ప్రతీతి. కోనేటి రాయుని విగ్రహంపై కటి వరద హస్తాలు, శంకు చక్రాలు, విగ్రహం చాతిపై శ్రీదేవి, భూదేవి ముద్రలతో అచ్చం తిరుమలలో స్వామివారిలాగే దర్శనమిస్తున్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన గ్రామీణ, మండల, జిల్లా కేంద్రాల్లో మొత్తం 48 శిక్షణ శిబిరాలను నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు వ్యాయామ విద్య, ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులతోపాటు జిల్లా కేంద్రంలోని మెసానికల్ స్టేడియంలో సంబంధిత క్రీడా శిక్షకులతో ప్రాథమిక స్థాయి నుంచి వివిధ క్రీడల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ శిబిరాల్లో క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ అందిస్తారు.



శిబిరాల వివరాలిలా..

- క్రీడ శిక్షణ శిబిరాలు:
- **వాలీబాల్:** గుడుపల్లి మండలం అగరం గ్రామం జెడ్పీ సంగనపల్లి, పుంగనూరు జెడ్పీ, జెడ్పీ రొంపిచెర్ల, జెడ్పీ కార్వేటినగరం, జెడ్పీ కుప్పం, జెడ్పీ గరిగచిన్నేపల్లి, జెడ్పీ పెద్దహరిజనవాడ కార్వేటినగరం, ప్రభుత్వ హైస్కూల్ చిత్తూరు, జెడ్పీ గంగవరం, కేవీకే నగరి, జెడ్పీ గుడిపాల, యాదమరి ఓపెన్ ప్లేస్, బంగారుపాళెం ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ ఇస్తారు.
- **టెన్నికాయిట్:** కుప్పం మండల కేంద్రం ప్రభుత్వ హైస్కూల్.
- **బాస్కెట్‌బాల్:** చిత్తూరు అర్బన్ బాస్కెట్ బాల్ కోర్టు మిట్టూరు-1, కేవీకే పలమనేరు, డీఎస్‌ఏ మైదానం చిత్తూరు, బంగారుపాళెం జెడ్పీ.
- **హాకీ:** ఐరాల మండలం కాణిపాకం జెడ్పీ హైస్కూల్ , వి.కోట జెడ్పీ.
- **కబడ్డీ:** నింద్ర మండలం కొప్పేడు అంగన్‌వాడీ, చౌడేపల్లి జెడ్పీ హైస్కూల్, సదుం జెడ్పీ, పుంగనూరు అరడిగుంట.
- **సాఫ్ట్‌బాల్:** ఐరాల జెడ్పీ హైస్కూల్, వెదురుకుప్పం ఆల్లమడుగు జెడ్పీ, జెడ్పీ పూతలపట్టు.
- **క్రికెట్:** నగరి కేవీకే కేంద్రం, డీఎస్‌ఏ మైదానం చిత్తూరు.
- **ఫుట్‌బాల్:** పుంగనూరు మండలం చంద్రమాకుల పల్లి జెడ్పీ హైస్కూలు, కేవీకే పలమనేరు, మెసానికల్ మైదానం.
- **రెజ్లింగ్:** మెసానికల్ మైదానం చిత్తూరు.
- **ఖోఖో:** వి.కోట మండలం నెర్నిపల్లి జెడ్పీ, బంగారుపాళెం ఏపీటీడబ్ల్యూఎస్, తవణంపల్లి మండలం మిట్టపల్లి, యాదమరి మండలం కొట్టాలం జెడ్పీ, దుర్గానగర్‌కాలనీ మున్సిపల్ హైస్కూల్ చిత్తూరు, బైరెడ్డిపల్లి మండలం తీర్థం జెడ్పీ.

సద్వినియోగం చేసుకోవాలి

వేసవిలో నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణ శిబిరాలను జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఉన్న చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలి. వేసవి శిక్షణ శిబిరాల్లో క్రీడా ప్రస్థానం ప్రారంభించిన చిన్నారులు భవిష్యత్‌లో ఎంతో మంచి క్రీడాకారులుగా ఎదిగారు. ఆయా క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, తమ ప్రాంతాల్లో చిన్నారులు ఈ శిక్షణ శిబిరాలకు హాజరయ్యేలా సహాయ సహకారాలు అందించాలి.

– బాలాజీ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, చిత్తూరు జిల్లా

తాగునీటి ఎద్దడి రానివ్వకండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో తాగునీటి ఎద్దడి రానివ్వకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. మండల స్థాయిలో సురక్షిత తాగునీటిని సరఫరా చేసే బాధ్యత ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. పర్యవేక్షణ బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులదేనని చెప్పారు.

నిధుల కొరత లేదు

తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు నిధుల కొరత లేదని కలెక్టర్ వెల్లడించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో బోర్ల డీపెనింగ్, రవాణా ప్రతిపాదనలు పంపే విషయంలో పరిశీలన చేసి, పంపాలన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి పంచాయతీ, జిల్లా పరిషత్ నిధులను కేటాయిస్తున్నట్లు చెప్పారు. కొత్తబోర్లు వేసిన ప్రాంతంలో పైప్‌లైన్‌లు, పంపుసెట్‌లు, మోటర్, విద్యుత్ కనెక్షన్‌లు అన్ని ఇచ్చిన తర్వాతే సంబంధిత పని పూర్తి అయినట్లవుతుందన్నారు.

గృహ నిర్మాణాల పురోగతి వేగవంతం

జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాలకు యాక్టీవ్ లబ్ధిదారులను గుర్తించి నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశాల్లో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు, హౌసింగ్ పీడీ గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రోజా విస్తృత పర్యటన



కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : ప్రారంభోత్సవాలు, వేడుకలు అంటూ మాజీ మంత్రి ఆర్కే రోజా బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం అరక్కోణం పనంబాకంలో నగరి పట్టణానికి చెందిన వారు నూతనంగా నిర్మించిన ఏజేఎస్ కళ్యాణ మండపాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం తిరుపతి పద్మావతిపురం సుబ్బయ్య ఫంక్షన్ హాల్‌లో స్విమ్స్ అమర్ కుమార్తె ఓణీ ఫంక్షన్‌లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. వడమాలపేట మండలం పూడి గ్రామంలో వైస్ సర్పంచ్ రాజశేఖర్ గారి కుమార్తె ఓణీ ఫంక్షన్‌లో పాల్గొని, చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం నింద్ర మండలం ఎక్స్ సర్పంచ్ రేవతి కుమార్తె నిశ్చితార్థంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మద్యం పాలసీలో అవినీతి లేదు

– మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం పాలసీలో రూపాయి కూడా అవినీతి జరగలేదని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి కె.నారాయణస్వామి అన్నారు. శ్రీరంగరాజపురం మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అక్రమంగా అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులను బెదిరిస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తోందని విమర్శించారు. ఈ అక్రమ అరెస్టులకు ఎవరు భయపడే ప్రసక్తే లేదన్నారు. గత ప్రభుత్వంలో మద్యం పాలసీలో ఒక్క రూపాయి అవినీతి జరిగిందని నిరుపించగలరా? అని నిలదీశారు. మీరు చేసే అరాచకం, అవినీతిని రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. ప్రతి పేద విద్యార్థి ఇంగ్లిషు మీడియం చదివి, ఎదగాలన్న ఉన్నత ఆశయంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను ప్రవేశపెడితే కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందన్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఇసుక, గ్రానైట్, గ్రావెల్ అక్రమంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతవుతున్నా కూటమి ప్రభుత్వం, అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సింహాచలం ఆలయం అభివృద్ధి పనుల్లో నాణ్యతను గాలికి వదిలేసి కమీషన్లకు కక్కుర్తి పడడంతో ఆ గోడ కూలి 8 మంది భక్తులు మరణించడం చాలా బాధాకరమన్నారు. భక్తుల ప్రాణాలంటే సీఎం చంద్రబాబుకు అంత అలుసా అని అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి, మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ, జగనన్న అని విధాలుగా అండగా ఉంటారని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ రామరాజ్యం కావాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు.

ఉద్యోగులపై కపట ప్రేమ



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కూటమి సర్కారు ఉద్యోగులపై కపట ప్రేమ చూపుతోందని వైఎస్సార్‌సీపీ ఉద్యోగు లు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం ఉద్యోగులకు అడ్డమైన హామీలిచ్చి తీరా వాటిని విస్మరించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అధికారంలో వచ్చి 11 నెలలవుతున్న ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లు చెప్పాలన్నారు. ప్రతి నెల సక్రమంగా జీతాలు కూడ ఇవ్వలేకపోతున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు అన్ని రకాలుగా కలిపి మొత్తం రూ.30 వేల కోట్లు బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందుల పేరిట కాలయాపన చేయడం సరికాదన్నారు. సీపీఎస్ రద్దు ఎప్పుడు చేస్తారోనని 3 లక్షల మంది ఉద్యోగుల కుటుంబాలు వేచి చూస్తున్నాయన్నారు. పీఆర్సీ కమిషన్ తీసి వేశారని, ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై అన్ని సంఘాలను కలిసి సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేసి దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, ఉద్యోగుల సంఘం నాయకులు ప్రసాద్‌రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉషశ్రీ



ఉషశ్రీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బుధవారం ఉషశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అరుణ్‌కుమార్ రిటైర్డు అయ్యారు. ఈ మేరకు సూపరింటెండెంట్ బాధ్యతలను ఉషశ్రీకి అప్పగించారు. కాగా ఆమె బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి నిర్వహణపై ఆమె అధికారులు, సిబ్బందితో మాట్లాడారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

చిత్తూరుఅర్బన్: నగరంలో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నాగరత్నం అనే నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. నగర శివార్లలోని పట్రాంపల్లెకు చెందిన దిలీప్‌కుమార్ అనే వ్యక్తిపై పాత కక్షల నేపథ్యంలో నాగరత్నం అనే వ్యక్తి గతవారం కత్తితో పొడిచి పారిపోయాడు. బాధితుడి తండ్రి రామచంద్రయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితున్ని అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. నిందితుడికి మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండు విధించడంతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటేష్(ఫైల్)

గంగవరం: మూడు నెలల కిందట కొడుకు మృతి చెందడం తీవ్ర మనస్తాపానికి గురైన ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చిన్నూరు గ్రామానికి చెందిన వెంకటేష్(54) పలమనేరు పట్టణంలో మారెమ్మగుడి ఎదురుగా దేవుళ్ల పటాల దుకాణం నడుపుతున్నాడు. మూడు నెలల క్రితం కొడుకు కిరణ్(27) బెంగుళూరులో ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కొడుకు మృతి చెందినప్పటి నుంచి తండ్రి వెంకటేష్ తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. మూడు నెలలుగా ఇంట్లో సక్రమంగా భోజనం చేయకపోవడం, దుకాణం తెరవకపోవడం, ఇంటి పట్టున సక్రమంగా ఉండడం లేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. తీరా చూస్తే మా రేడుపల్లికి సమీపంలోని కౌండిన్య నది వద్ద చింతచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

– నూతన డీసీఈబీ కార్యదర్శిగా హేమాద్రి



హేమాద్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెచ్‌ఎంలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం నూతన కార్యదర్శి హేమాద్రి అన్నారు. నూతనంగా నియమితులైన ఆయన బుధవారం పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలోని డీసీఈబీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ డీసీఈబీ నియమ, నిబంధనల ప్రకారం పరీక్షల నిర్వహణ, విద్యార్థుల ప్రమాణాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆయనకు పలువురు హెచ్‌ఎంలు అరుణ్‌కుమార్, సోమశేఖర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, హుస్సేన్‌బాషా, భాస్కర్‌రావు, జ్యోతి ప్రసాద్, మాజీ కార్యదర్శి పరశురామ్‌నాయుడు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ఆర్టీసీ-2 డిపోలో బుధవారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. 11 వ పీఆర్సీకి సంబంధించి 24 నెలలు అరియర్స్, నాలుగు డీఏలు, అరియర్స్ సరెండర్ లీవులు, లీవ్ ఎన్ క్యాష్‌లకు సంబంధించి రూ.వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ఒక్క బకాయి కూడా సర్వీసులో ఉన్న ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు ఇవ్వడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలను దశలవారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ ఉద్యోగుల ఆనందం ఆవిరైందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న 3,500 మంది ఉద్యోగోన్నతులు వెంటనే అమలు చేయాలన్నారు. ఖాళీలు ఉన్న డ్రైవర్లు, కండక్టర్ పోస్టులతోపాటు 10వేల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు అర్జున్, విజయ్‌కుమార మురళీధరన్, వి.ఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

అడవిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

శ్రీరంగరాజపురం : అడవిలోని పెద్ద చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించిన సంఘటన మండలంలోని రాణిపురం గ్రామం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు రాణిపురం గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు బీడీ తయారీకి ఉపయోగించే తూనీక ఆకుల కోసం బుధవారం పుల్లూరు అడవికి వెళ్లారు.ఆ సమయంలో పుల్లూరు అడవిలోని పెద్ద చెరువు వద్ద ఎముకలు బయటపడిన మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి 8 గంటల సమయానికి పోలీసులు స్థానికుల సాయంతో మృతదేహం ఉన్న స్థలానికి చేరుకొని పరిశీలించి మృతి చెందినది పురుషుడిగా గుర్తించారు. అతను చనిపోయి దాదాపు మూడు నుంచి ఐదు నెలలు క్రితమే మృతి చెంది ఉండవచ్చునని చెబుతున్నారు. ఆత్మహత్యా? లేక ఎవరైన హత్య చేశారా అనే విషయాలు విచారణలో తేలనున్నాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

శ్రీనిఫుడ్ ఫ్యాక్టరీలో ఏనుగుల హల్‌చల్



మొగిలి శ్రీనిఫుడ్ ఫ్యాక్టరీలో సంచరిస్తున్న ఏనుగులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శ్రీనిఫుడ్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి ఏనుగులు ప్రవేశించి హల్‌చల్ చేశాయి. ఫ్యాక్టరీ సమీపంలోని కౌండిన్య అటవీ ప్రాంతం నుంచి గొనిచెరువు మీదుగా రెండు ఏనుగులు ఫ్యాక్టరీలోకి ప్రవేశించాయి. సెక్యూరిటీ, ఫ్యాక్టరీ సిబ్బంది ఏనుగుల రాకను గురించి అరుపులు, కేకలు వేయడంతో తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయని తెలిపారు. బుధవారం సాయంత్రం రెండు ఏనుగులు గొనిచెరువులో దిగి సేద తీరాయని, అటు తరువాత అడవిలోకి వెళ్లి తిరిగి సమీపంలోని ఫ్యాక్టరీలోకి వచ్చాయన్నారు. మూడు, నాలుగు సార్లు ఏనుగులు ఫ్యాక్టరీలోకి వచ్చాయని సిబ్బంది తెలిపారు.

ప్రతి స్కూలుకు రెండు ఎస్జీటీ పోస్టులు కేటాయించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా ప్రతి స్కూలుకు రెండు ఎస్జీటీ పోస్టులు కచ్చితంగా కేటాయించాలని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరోత్తమరెడ్డి కోరారు. బుధవారం ఆయన పలు డిమాండ్ల పరిష్కారంపై విలేకరులతో మాట్లాడారు. ఉన్నత ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:45 ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఎస్సీలో నియమితులయ్యే టీచర్లను క్లస్టర్‌లో అదనపు టీచర్లుగా నియమించాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలకు విద్యార్థులతో నిమిత్తం లేకుండా హెచ్‌ఎం, అన్ని సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్స్, పీడీ పోస్టులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్‌ని తప్పనిసరిగా నియమించాలన్నారు. ఇటీవల డైట్, సమగ్రశిక్ష శాఖలో పనిచేస్తున్న సెక్టోరల్స్‌ను పూర్తి కాలం కాకముందే రీ ప్యాట్రియేషన్ చేయడం దారుణమన్నారు. అలాంటి టీచర్లకు రాబోయే బదిలీల్లో అనుమతి ఇస్తూ పాత పాఠశాల నుంచి సర్వీస్ లెక్కించాలని డిమాండ్ చేశారు. వైద్య ధ్రువీకరణ గతంలోకి, ఇప్పుడు ఇస్తున్న వాటికి ఎక్కువ వ్యత్యాసం ఉన్న వాటిని తిరిగి పునఃపరిశీలించాలన్నారు.